# తప్పు ఎవరిది?

"ఈవేళ పత్రికలో ఒక చెడు వార్త చదివానురా! మరి, నిజం అవునో కాదో నమ్మడానికి మనస్కరించడంలేదు. నమ్మకుండా ఉండడానికి వీలులేదు." ముఖం వేలవేసుకుని లోపలికి వస్తూనే అన్నాడు సుబ్బారావు.

"ఇంతకూ ఆ వార్త ఏమిటో చెప్పకుండా ఉపన్యాసం ఇస్తావేమిరా సుబ్బా!" అన్నాడు వెంకటరావు.

"తాతయ్య - జ్ఞాపకం లేదూ? మనతో కలసి చిన్నప్పుడు ఆడుకుంటూ ఉండేవాడే, ఆ తాతయ్య - అతని అసలు పేరు తాతరాజు - అతగాడు పోయాడురా!"

"ఏమి వచ్చిందీ?"

"చంపేశారురా ఎవరో! ఖూనీట... ఇటీవల జెయిలు లోంచి విడుదల అయిన ఒక నేరస్థుని ఈ కేసు సందర్భంలో అనుమానం మీద అరెస్టు చేశారని పత్రికలో ఉన్నది"

"చాల విచారంగా వుందోయ్! తాతయ్య నాకు జ్ఞాపకం లేకపోవడం ఏమిటి? నాకు మొదట్లో సిగరెట్లు కాల్చడం నేర్పింది అతగాడే!" సిగరెట్టుపొగ పైకి విడుస్తూ సాలోచనగా విచారంతో అన్నాడు వెంకటరావు.

"ఖూనీలు చేయడానికి వాళ్ళకు చేతులు ఎలా వస్తవో! అది తెలిసిన క్షణం నుంచి నా కడుపులో ఎవరో చేయిపెట్టి

కెలుకుతూ ఉన్నంత బాధగా ఉందిరా! దుఃఖం భరింపశక్యం కానంత ఉధృతంగా ముంచుకు వస్తున్నది." అన్నాడు సుబ్బు.

నాతో చదరంగం ఆడుతూ ఆటలో లీనమై ఉన్న మా నరసింహం, ఆ మాటలంటూ సుబ్బు విడిచిన దీర్ఘ నిశ్వాసం చెవులకు సోకిందో యేమో, అటు తిరిగి "అసలు సంగతి అంటూ నీకు తెలిస్తే నువ్వు మన - తాతయ్యకోసం అంత విచారించవురా సుబ్బూ! ఆ వార్త నేనూ చదివానులే. సంగతంతా తెలుసుకొంటే నీ సానుభూతి ఆ ఖూనీ చేసిన అనుమానం పడిన వ్యక్తి మీదికి మళ్ళుతుందేమోనని నాకు భయంగా ఉన్నది" అన్నాడు.

"ఏమిటా కథ? నీకు తెలిస్తే చెప్పరా!" అని అడిగాను ఉండబట్టలేక.

నరసింహం చెప్పడం మొదలు పెట్టాడు. నరసింహం మొదలు పెట్టగానే మేము అలవాటు ప్రకారం సావధానంగా వినడం సాగించాము -

"ఇది కథ కాదురా, నిజంగా జరిగినది!"

"ఇది మనం అందరం పొట్టలుచేతబట్టుకుని మన ఊరు విడిచి పోయిన రెండు మూడుఏళ్ళ తరువాత జరిగిన సంఘటన"

సెలవుమీద ఇంటికి వెళ్ళి జబ్బుపడి ఊళ్ళోనే ఉండిపోవలసివచ్చింది. ఆ రోజులలో జరిగిన కథ ఇది.

"మా యింటి ప్రక్కనే సుబ్బరాజు వుండేవాడు. మీకు తెలుసుగా? ఆరడుగులు పొడుగు, ఆజాను బాహువు.

మెలికలు తిరిగిన కండలు. పెద్దపులి నయినా ఒంటిగా ఎదిరించి ప్రాణాలు తీయగలిగిన చొరవ, విశేషమైన బలం, చదువుసంధ్య లేకపోయినా ఎంతో మర్యాద అయిన మనిషి. పెద్దమనిషి, మంచివాడు, నమ్మకస్తుడు అనిపించుకొన్నాడు. పాపం! పూటకు గతిలేనివాడు. గుర్రపుబండి తోలుకుని ఎలాగో బ్రతికేవాడు.

అతని దారిద్ర్యం అంటే అంతా చూస్తూ సహించగలిగారుగాని, అతను తనను, కుటుంబాన్ని పోషించుకునేందుకు బండి కిరాయికి తోలుకొనడం మాత్రం ఊళ్ళో ఉన్న అతని బంధువులు, కులంవారు గ్రహించలేక పోయారు. అతని బంధువులు అందరూ బాగా ఆ స్తిపరులే.

సుబ్బరాజు కొంచెం కోపదారి అయిన మనిషి. అడపా తడపా ఒక చుక్క సేవించే అలవాటు కూడా ఉన్నది. ముఖ్యంగా అలాంటి సమయాలలో అతను తేరిపార చూడ శక్యంకానంత భీకరంగా వుండేవాడు. అయితే నేం? అటి పరిస్థితిలో మళ్ళీ బండి కట్టినా ఎంతో పెద్దమనిషి తరహాగానే, మంచిగానే మసలుకునే వాడుకాని, చెడ్డపేరు ఏమీ తెచ్చు కొనలేదు.

బంధువులలో ముఖ్యులు, దగ్గరవారు – ఆ మాటకు స్వయాన మేనత్తగారి బిడ్డలే – నిన్న మొన్న చచ్చిపోయిన 'తాతయ్య' అతని తమ్ములు ముప్వురు. వీరు సుబ్బరాజును అననిమాట లేదు. తిట్టని తిట్టులేదు. దూషించకుండా విడిచిన దూషణలేదు. అయినా సుబ్బరాజు వారి మీద కోపం తెచ్చుకోనూలేదు. పగ సాధించనూలేదు. కాని గ్రామంలోనివారు

ఎవరూ తన బండి కట్టించుకోనకుండా చేయడానికి వారు ప్రయత్నించడం మాత్రం సుబ్బరాజు సహించలేకపోయాడు"

ఆ తరువాత ఏదోవంక దొరికితే 'తాతయ్య' తమ్ముణ్ణి నడిబజార్లోనే పట్టుకొని చావగొట్టాడు సుబ్బరాజు. సుబ్బరాజుకు 'బుద్ధి' చెప్పడానికి తాతయ్య, తమ్ములు, తదితరులు అందరూ కలసి వెళ్ళితే మళ్ళా వాళ్ళనుకూడా కొట్టాడు. అప్పటినుంచి తాతయ్య కుటుంబంవారికి, సుబ్బరాజుకు మధ్య తీవ్రమైన స్పర్థ రగులుతూ వచ్చినది.

ఈ విధంగా గొడవ చాలకాలమే నడచినది. సుబ్బరాజు మీద ఏవిధంగానూ పగ సాధించుకోలేక పోయారు తాతయ్య, తాతయ్య సోదరులు. తల్లిదండ్రుల మంచి గుణాలు రాకపోయినా వారి చెడ్డగుణాలు, వారి స్పర్థలు కక్షలు, కావేష్యాలు పిల్లలకు సంక్రమించడం సహజమే కదా? సుబ్బరాజు కొడుకును కొట్టి చెరువుగట్టుమీద పారవేశారు తాతయ్య కొడుకులు ఒకనాడు. పిల్లలలో క్రూరత్వం ఒకపాలు హెచ్చుగా ఉంటుంది. సుబ్బరాజు కొడుకు మూడు నెలలకుగాని మంచంమీదనుంచి లేవలేకపోయాడు. ఈ మూడు నెలల్లో ఏకైక కుమారుని కోసం సుబ్బరాజు బండి తోలడం మానుకున్నాడు. ఇల్లు విడిచిపెట్టడం మాట దేవుడు ఎరుగుకాని, కొడుకు మంచంకూడా విడిచి కదిలి ఎరుగడు.

సానుభూతి అని ఇందాక మీలో ఎవరో అన్నారు. సానుభూతికూడా ఒకప్పుడు ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందో చెబుతాను.

ఈగొడవ (సుబ్బరాజు కొడుకును కొట్టిన ఘటన) జరగడానికి కొలది కాలం ముందు ఆ ఊళ్ళో ఒకాయన భూములు కొనుక్కుని కాపురం పెట్టుకున్నాడు. ఆయనగారి నివాసం తాతాయ్య ఇంటిప్రక్కనే. భూములు, ఇల్లు రెజిస్ట్రేషన్ చేసుకునే సందర్భంలో ఆయన చాలా తరచుగా సుబ్బరాజు బండి కట్టించుకొనడం పరిపాటి అయినది. సుబ్బరాజుతో అనుబంధం ఏర్పడినది. అతని కుమారుడు దెబ్బలు తిని మంచానపడిన రోజుల్లో కొంచమో గొప్పో సహాయం చేశాడు. ముఖ్యంగా సానుభూతి చూపి ఆప్తుడు అయ్యాడు.

ఆయనగారు - ఆయన పేరు ప్రకాశం - యింటి పొరుగున ఉన్న తాతయ్య కుటుంబం వారితో కూడా స్నేహం సంపాదించుకున్నాడు.

తీరా కొడుకు ఆపదనుండి బయటపడి యిక లేచి తిరుగుతాడనే నమ్మకం చిక్కేసరికి, అంతవరకు లోపల లోపల అణచిపెట్టుకొని ఉన్నకోపం పైకి ఉబికింది. సుబ్బరాజు తాతయ్యను, తాతయ్య సోదరులను హతమార్చి వంశనాశనం చేసివేస్తానని 'ఆప్తుడు' అయిన ప్రకాశంగారితో అనడం మొదలుపెట్టాడు.

తాతయ్య కుటుంబం వారు నిజంగా అంతటి ప్రాయశ్చిత్తం అనుభవించడానికి తగుదురని సుబ్బరాజుతో సానుభూతితో అన్న ప్రకాశంగారు యింటికి చేరుకొని తాతయ్య కుటుంబం పట్ల సానుభూతితో వారికి యీ 'బెదరింపుల' సంగతి నివేదించుకున్నాడు. వారు ఆత్మరక్షణకోసమని ఒకే

ఒక ఉపాయం ఆలోచించుకొని ఆ ఉపాయం కాస్తా ప్రకాశంగారి చెవిని వేశారు.

ఆఉపాయం ఇది. మన తాలూకాలో 'పదిరూపాయలకొక ఖూనీ' చేసే హంతకుడు వున్నాడు. అతని పేరు 'రామరాజు.' అతన్ని రప్పించి యింట్లో ఉంచుకుంటే తమను రక్షించనూ గలడు. అవసరం వస్తే సుబ్బరాజును హత మార్చి, తమకు ఆ ఆపద లేకుండా గట్టెక్కించనూ గలడని 'తాతయ్య', తాతయ్య సోదరులు అనుకొన్నారు. అనుకోవడం ఏమిటి? రామరాజు వచ్చి తాతయ్య యింట్లో మకాం పెట్టాడు.

కొడుకు ఆ రోజున మొదటిసారిగా లేచి తిరగడం ప్రారంభించాడు. సుబ్బరాజు ఆనందం పట్టలేక, అంతకాలమూ రుచి చూడడం మాట ఎలా వున్నా తలపెట్టనైన తలపెట్టకుండా ఉన్న మద్యం పూర్తిగా సేవించి ఉన్నాడు. అతని మనసులో ఆనందం ఉన్నదే తప్ప కోపంలేదు.

ఉదయం రామరాజు తాతయ్య యింట్లో ప్రవేశించాడు.

సాయంకాలంవేళ సుబ్బరాజు త్రాగిన మత్తులో ఇంటికి పోతూ ఉంటే ప్రకాశంగారు తన ఇంటివద్ద అతన్ని నిలుపుచేసి, తాతయ్య కుటుంబం వారి ఉపాయము, రామరాజు ఆగమనము అతనితో చెప్పాడు.

అసలే కోపం. కొడుకును కొట్టేరన్న కోపం ఒకటి. పైగా యిప్పుడు హంతకుని పిలిపించి యింట్లో ఉంచుకోవడంతో నిగ్రహించుకొనలేకపోయాడు. సాహసి. అందు

లోనూ త్రాగి ఉన్నవాడు. దీని అంతు తేల్చుకునేందుకు ఆ రాత్రే తాతయ్య ఇంటికి వెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు. సుబ్బరాజు ఆ మాటదాచుకోకుండా ప్రకాశంగారితో చెప్పేయడంకూడా జరిగిపోయినది. తీరా సుబ్బరాజు సందుమలుపు తిరిగేసరికి ఆ కబురు కాస్తా తాతయ్యకు చేరవేయడంలో ఆలస్యం చేయలేదు ప్రకాశంగారు. సానుభూతిపరుడు...

ఆ రాత్రి కర్ర చంకను పెట్టుకుని సుబ్బరాజు తాతయ్య ఇంటికి వెళ్ళాడు. అంతా మూడు నిమిషాల్లో జరిగిపోయింది. గుమ్మంమాటునే పొంచి ఉన్న రామరాజు మూడుపోట్లతో సుబ్బరాజు ప్రాణాలు తీశాడు.

కాని కొన ఊపిరితో సుబ్బరాజు కర్రతిప్పి కొట్టిన దెబ్బకు రామరాజుతల బ్రద్దలు అయినది.

సుబ్బరాజు శవం ఇంట్లో వుండగానే అతనిలో యింకా ప్రాణం వుందో లేదో తేల్చుకోవడానికి ఆయుర్వేద వైద్యుడు శేషాచార్యులుగారిని కళ్ళకు గంతలు కట్టి అరేబియానైట్స్ కథలలో మాదిరిగా తాతయ్య తీసుకొని రావడము, ఆయన సుబ్బరాజు ప్రాణాలు నిశ్శేషంగా హరించిపోయినవని తీర్పు యివ్వడం జరిగినది.

చాలకాలంగా రామరాజును పట్టుకొనడానికి అన్వేషిస్తున్న పోలీసులు యీ పర్యాయం రామరాజును పట్టుకున్నారు. సుబ్బరాజు చేతికర్రకు అయిన రక్తం పరీక్షించగా అది రామరాజు రక్తమని ఋజువు అయింది. ఆయుర్వేద వైద్యుని సాక్ష్యం మరొకటి. అన్నిటినీ మించి తాతయ్య తన ప్రాణాం రక్షించుకొనడానికి నేరం అంతా

రామరాజుమీద త్రోసి వేయడంతో రామరాజుకు పధ్నాలుగు సంవత్సరాల కఠిన నరకం విధించారు. కేవలం ప్రకాశం గారి సానుభూతి ఇంతటి భీకర పరిణామానికి దారితీసినా ఆ కేసులో ఆయన పేరుకూడా వినరాలేదు.

కారాగారవాసంలో మానవుడు ఆత్మపరీక్ష ప్రారంభించి, అధమం తనలో రాక్షసాన్ని కొంతవరకు చంపుకొనగలడు అనేది కాని, ఆఖరికి అతనిలోని కోపం అయినా నశించి పోతుందనేది కాని రామరాజు విషయంలో నిజం కాలేదు.

మొన్ననే పుష్యమాసంలో ఉత్తరాయణం ప్రారంభమైన శుభతిథిని రామరాజుకూడా అశేషమైన నేస్థులతో పాటుగా కారాగారంనుంచి విడుదల అయ్యాడు.

రామరాజుకు సుబ్బరాజుమీద కోపం ఏమీలేదు. ఆ మాటకు సుబ్బరాజు ఎవరో కూడా అతనికి తెలియదు. కేవలం తన వృత్తి ధర్మం అనుసరించి పదిరూపాయలు కూలి ఇస్తే తీసుకొని కూలి ఇచ్చినవారు చూపించిన మనిషిని పొడిచి చంపాడు. అంతకన్న అతనికి బాధ్యత ఏముంది?

కాని తాతయ్య విషయం వేరు. కూలి ఇచ్చి పని చేయించుకున్న వాడు ఆ బాధ్యత స్వీకరించడం సబబు. ఇంతవరకు రామరాజు జీవితంలో అతన్ని వినియోగించినవారే ఆ బాధ్యత వహించిన రామరాజు పేరు బయటికి పొక్కకుండా చేసి, తిరిగి ఎప్పుడు అయినా అతని పని పడితే పిలిపించుకుని అతని సేవలు పొందుతున్నారు.

ఈ న్యాయానికి విరుద్ధంగా వ్యవహరించినవాడు, తనను కారాగారవాస శిక్ష విధింపచేసినవాడు తాతయ్య. రామరాజు ఆలోచన ఇదే. అతనికి మనుషులలో నమ్మకం పోయినది.

ఖైదులోంచి బయటికి వచ్చాడు. సరాసరి ఇంటికి పోయాడు. ఏడేళ్ళ కారాగార వాసంలో తుప్పుపట్టిన కత్తికి పదును పట్టుకున్నాడు. తాతయ్యను పొడిచి పారేశాడు. తిరిగి 'కృష్ణ జన్మస్థానం' చేరుకున్నాడు.

"దీనిలో ఎవరిది తప్పు అంటారు?" అంటూ నరసింహం మా అందరి వంక చూచాడు.

మేము సాలోచనగా అతని వంక చూస్తూ కూర్చుండిపోయాము.

నిజానికి దీనిలో తప్పు ఎవరిది?